# భార్యలు

"ఏ........య్, వేణూ! ఇట్రా" అని అరిచింది అరుణ. "అబ్బ! ఏంటండీ ఆ అరుపులు? అవతల తాళింపు మాడిపోతోంది" అన్నాడు వేణు, అచ్చం కథల్లో భార్యలా.

"తమాషా కాదు... ఇట్రా, ఇట్రా" అని మళ్ళీ అరిచింది అరుణ.

"వుండు.... ఒక్క నిమిషం, కాఫీ తీసుకొస్తాను. అయినా అరుణా, ఈ ఎన్నికల కాలంలో ఆ దినపత్రికలు చదవద్దంటే వినవు. చదవడమూ... కెవ్వున అరవడమూ! ఎన్నికలెప్పుడూ అలాగే వుంటాయి, పత్రిక లెప్పుడూ ఇలాగే వుంటాయి" అని ఇంకా ఏదో మాట్లాడుతున్నాడు వేణు.

"అబ్బ.. అదికాదోయ్........ ఇదివేరే. సరే నువ్వురావు గదూ, ఇదిగో.. యీవార్త చదివి నేను మూర్ఛపోతున్నాను. నువ్వొచ్చాక కొంచెం కాఫీ ముఖాన జల్లి లేపు" అని అరుణ అంటోండగానే, వేణు వచ్చేశాడు.

"వచ్చేశాను. ఇదిగో నీ కాఫీ. చూశావా! నువ్వు మూర్ఛపోక ముందే వచ్చేశాను. ఏమిటా వార్త? ఇద్దరం మూర్ఛపోవాలా?" ఓ కప్పు అరుణ ముందున్న 'టీపాయ్' మీద పెట్టాడు. తన కాఫీ 'సిప్' చేస్తూ అడిగాడు.అరుణ తన చేతిలో మడచి వుంచిన పేపర్లో వున్న ఒక వార్తని ఎడం చేతి చూపుడు వేల్తో చూపింది. మళ్ళీ దీన్ని కళ్ళతో చూడలేనన్నట్టు తలగోడవైపుకు తిప్పి అందించింది. ఈ పాటికే మెదడులో చేరిన ఆ వార్తను విదిలించుకోడానికి 'మెదడు వాంతి' చేసుకుంటున్నట్టు 'యాక్.......యాక్' అంటూ తల విదిలించింది. ఆ అభినయానికి వేణుకు నవ్వొచ్చింది, వొచ్చింది కాదు...... నవ్వాడు.

"నవ్వడం కాదు చదువు" అంది అరుణ సీరియస్గా. వేణుకు ఇప్పుడు కొంచెం ఆశ్చర్యమేసింది. చదవడం మొదలు పెట్టాడు.

"ఫలానా పార్టీ అభ్యర్థి శ్రీ మోహనరావు గెలుపు కోసం ఆయన భార్య శ్రీమతి సరళామోహనరావు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్నారు. ఆడవాళ్ళకు బొట్టుపెట్టి తన భర్తను గెలిపించవలసిందిగా కోరుతున్న ఆమె వెంట పెద్ద సంఖ్యలో మహిళలు ప్రచారం సాగిస్తున్నారు" - ఈ వార్తతోపాటు ఒకామెకు బొట్టు పెడుతున్నసరళ, చుట్టూ ఆడవాళ్ళున్న ఫోటో కూడా వుంది. వేణు పేపర్ పక్కన పడేశాడు. "ఇప్పుడిక నువ్వు వంట చెయ్యలేవు. నువ్వు 'రెస్టు' తీసుకో. ఏమీ ఆలోచించవద్దు. తర్వాత, ఇద్దరం కలసి దీన్ని గురించి ఆలోచిద్దాం. సరేనా?" అని, ఇద్దరి కప్పులూ అందుకొని లేచాడు.

అరుణకు మొన్న హఠాత్తుగా 104 డిగ్రీల జ్వరం వొచ్చింది. ఆఫీసు నుంచీ మధ్యాహ్నమే ఇంటికొచ్చేసింది. సాయంత్రం వేణు వచ్చేసరికి, స్పృహలేనట్టుపడుకుని వుంది. వెంటనే డాక్టర్ గంగాధర్ దగ్గరికి తీసుకెళ్ళి చూపిస్తే, ఆయనేవో మాత్రలిచ్చి, రాత్రి నాలుగు గంటలకొకటి వెయ్యమని చెప్పి, మరుసటి రోజు రావాలని హెచ్చరించారు. బహుశా ఆయన అనుమానం అది మలేరియాయేమోనని. అయితే ఆ మరుసటి రోజు అరుణకు జ్వరం తగ్గిపోయింది. తగ్గింది కనుక తీసుకురాలేదని ఫోన్లో చెబితే, "నేను తీసుకరమ్మన్నాను కదా!" అని డాక్టర్ అడిగాడు. "ఏం లేదు డాక్టర్, ఎన్నికల వార్తలు చదువుతుంది. అందుకని వచ్చుంటుంది" అన్నాడు వేణు. "డయాగ్నొజ్ చేసి ఆమాట చెప్పవలసింది నేనా? మీరా?" అని తగులుకున్నాడు డాక్టర్.

"మరి, ఆవార్తలు చదివిన వాళ్ళందరికీ జ్వరం రావాలి గదా?" అని ఇంకో ప్రశ్న వేశాడు. "వస్తుందొస్తుంది, లేదా జ్వరమొచ్చే ఆవార్తలు చదువుతూ వుండాలి. మీరేమీ 'డిజప్పాయింట్' కాకండి అందరికీ వస్తాయి. అందుకు సందేహం లేదు. అందుకే పత్రికల్లో 'ఎన్నికల జ్వరం అందుకుంది'.'వేడి అందుకుంది' అంటుంటారు. చూశారా?" ఇద్దరూ నవ్వుకున్నారు. అయినా, వేణు ముందు జాగ్రత్త చర్యగా అరుణ చేత మూడ్రోజులు సెలవు పెట్టించి గృహ నిర్బంధంలో వుంచి వంటింటి నుంచీ బహిష్కరించాడు." "నాకు జ్వరం పోయింది. వంటింటి వైపు రావొచ్చు" నని అరుణ అంటున్నా వినడం లేదు.

"అదేమిటోనోయ్! నాకు ఆఫీసులో కన్నా వంటింట్లోనే బావుంది. వంటిల్లు ఇంత బావుంటుందన్నమాట. అందుకే ఆడవాళ్లు వంటింటిని వదలందీ, నువ్వు వంటిల్లో అంటున్నదీ...... కదూ! మరి ఆ విమలేమిటి వంటింటిని కూల్చేద్దామంటుంది?" అన్నాడు వేణు.

ఈ మధ్య ఉదయం పూట పత్రికలో ఎన్నికల వార్తలు చదివి బాగా నవ్వుకునే

వాళ్ళు. 'కన్యాశుల్కం' లో హాస్యబీభత్సం వుందని శ్రీశ్రీనో, ఎవరో అన్నారట. ఈ ఎన్నికల వార్తల్లో కూడా అలాంటి హాస్యబీభత్సం వుందని అనుకునేవాళ్ళు. శ్రీకృష్ణుడితో కలసి యుద్ధానికి వెళ్లిన సత్యభామలా... ఫలానా 'భార్య' ఎన్నికల సంగ్రామంలో దూకినట్టు అభివర్ణించే విలేకరుల వైఖరులు చాలా తమాషాగా వుండేవి వాళ్లకు. "అది యుద్ధమైతే, వీళ్ళు యుద్ధ విలేకరులు గావాల!" అనుకునే వాళ్ళు. 'భార్య' సత్యభామ. 'భర్త' శ్రీకృష్ణుడు....... మరి వీళ్లిద్దరూ యుద్ధం చేయవలసిన ప్రత్యర్థి అభ్యర్థి నరకాసురుడు కావాలగదా! అలా అనరాదు మళ్ళీ. "పాపం...... అందరూ నరకాసురులే అయినా, నరకాసురుడు లేని యుద్ధంగా చెప్పవలసి రావడం పారడాక్సికల్ సిట్యుయేషన్" అని నవ్వుకునేవాళ్ళు. తమ మాటలు గానీ వింటే, రాజకీయ నాయకులూ, జర్నలిస్టులూ కలిసి తమని తంతారని కూడా అనుకునేవాళ్లు. వీళ్లిద్దరూ ఇట్లా అనుకుంటూ వుంటే.... భార్యలు ప్రచారంలో పాల్గొనడం పురోగమనమేననీ, ప్రజాస్వామ్యవాదులు బలపరచాలనీ, ప్రకాశరావు వాదించాడు. ఈ విధంగా, అటు వేపున భార్యలు ప్రచారంలో ముమ్మరంగా పాల్గొంటూ వుంటే, ఇటు అరుణ ఇంట్లో అది 'పురోగమనమా, తిరోగమనమా?' అన్న చర్చ ముమ్మరంగా సాగింది. ఇదంతా అటు వంటింట్లో వున్న వేణుకూ, ఇటు 'రెస్టు' తీసుకుంటున్న అరుణకూ మనసులో తిరుగుతోంది. "ఏమీ ఆలోచించవద్దు" అని వేణు చెప్పినా, అరుణ ఆలోచిస్తూనే వుంది. అట్లా చెప్పిన వేణు కూడా ఆలోచిస్తూనే వున్నాడు. "ఇద్దరం కలసి ఆలోచిద్దాం" అన్నాడు. కలసికాకపోయినా, ఇద్దరూ ఒకే విషయం గురించి ఆలోచిస్తున్నారు. అవును. సరళ, ఎన్నికల్లో నిలబడిన భర్త గెలుపు కోసం ప్రచారం చేస్తోందంటే చిత్రమే మరి. "వీళ్ళంతా భర్తల గెలుపు కోసం ఎందుకు ప్రచారం చేస్తున్నట్టు?" అని ఆలోచిస్తే, "భార్యలు కనుక" అనుకోవలసిందే. "భర్తలు గెలిస్తే వీళ్ళేమవుతారు?" - ఏమీకారు, భార్యలుగానే వుంటారు, భర్త ఎమ్మెల్యే అయితే, యీమె 'ఎమ్మెల్యేగారి భార్య' అవుతుంది. భర్త మంత్రి అయితే, యీమె 'మంత్రిగారి భార్య' అవుతుంది. "తమ భర్తలు మంచి అభ్యర్థులని నమ్మి వీళ్ళు ప్రచారం చేస్తూవుండొచ్చు కదా" అంటాడు ప్రకాశరావు. భర్త మంచి అభ్యర్థా, కాదా అని ఆలోచించే అవకాశమే లేదని ఇప్పుడు సరళ నిరూపించింది. ఇందులో పురోగమనమే మాత్రం లేదు. అధికారం వర్గాధిపత్యం కింద వుండడం నుంచీ, వారసత్వ హక్కుగా, కుటుంబ పరిధికి చెందినదిగా మార్చాలన్న ప్రయత్నం ఇది. ఇట్లా మారిస్తే, సామూహిక ప్రతిఘటన నుంచీ తప్పుకోవచ్చునన్న ఎత్తుగడ ఇది. పదవిలో వున్న భర్త మరణిస్తే ఆ స్థానాన్ని భార్యకు బదలాయించే క్రమం దీన్నుంచీ పుట్టిందే. సరళ, అరుణ క్లాస్‌మేట్. మూణ్ణెల్ల కిందట, మోహనరావు నుంచీ తాను విడాకులు తీసు కోవాలనుకుంటున్నట్టూ, అతన్ని భరించడం ఇక తన వల్ల కాదని తేల్చుకున్నట్టూ ఉత్తరం రాసింది. అంతకు

ముందు రాసిన ఉత్తరాల్లో కూడా ఎక్కువగా భర్త వల్ల పడుతున్న బాధల్ని గురించే రాసింది. మళ్ళీ వాళ్ళిద్దరిదీ అంతో ఇంతో ప్రేమ వివాహమే. "అతనింత పనికిమాలిన వాడని అప్పుడు కనిపెట్టలేకపోయావా?" అంటే........ "ప్రయత్నించివుంటే కొంత పనికిమాలినవాడని గ్రహించే దాన్నేమోకానీ, ఇం... త పనికిమాలినవాడని తెలుసుకోవడం నాకే కాదు, ఎవరికీ సాధ్యం కాదు. అతన్తో దాంపత్యం గంట గంట గండంగా గడచింది. అయినా, గంటలు కాదు, దినాలు కాదు, నెలలు కాదు..... ఇరవై ఏళ్ళు గడిపాము. ఇకనా వల్లకాదు" అని రాసింది. ఎమ్మెల్యే అయిన తర్వాత ఎక్కువగా హైదరాబాద్‌లో వుండడంతో, తనక్కొంత బావున్నట్టు అనిపించిందట. అయితే, అక్కడతనికి ఇంకో ఆవిడ వున్నట్టు తర్వాత తెలిసిందట. ఆమె తన భార్యనీ, రాజకీయాల్లో తనకు ఆమె ప్రోత్సాహం ఎంతగానో లభిస్తున్నదని అతను చెప్పినట్టు పత్రికలలో వచ్చిందట. తనతో అతనికీ, అతన్తో తనకూ ఏమాత్రం అవసరం లేదుగనుక, విడిపోదల్చుకున్నాననీ, గుంటూర్లో మీకు తెలిసిన మంచి లాయర్ వుంటే చూడమనీ.... రాసింది.

ఆ ఉత్తరం వచ్చిన తర్వాత, అరుణ ఓ ఆదివారం గుంటూరు వెళ్ళి, సరళను చూసి వచ్చింది. సరళ నలభై ఏళ్ళకే ముసలిదైపోయింది. భర్త సంగతులూ, ఆ ఇంట్లో వాళ్ళ సంగతులూ చెబితే, అరుణకు వొళ్ళు జలదరించిందట. మోహనరావు తమ్ముడు రాజారావు పెద్ద గూండా. ఒక వ్యాపారి భార్యను బలవంతంగా ఎత్తుకొచ్చి ఇంట్లో పెట్టుకున్నాడట. ఆ వ్యాపారి ఎంత మందికి మొరపెట్టుకున్నా, రాజారావును ఎవరూ ఏమీ చెయ్యలేక పోయారట. ఓసారి వాడు తాగొచ్చి, సరళ చెయ్యి పట్టుకున్నాడట. ఆ సంగతి వాడి అన్నకు చెబితే, వాడేమన్నాడనీ! "ఫర్వాలేదులే, నీ పాతివ్రత్యమేమీ చెడదు. వాడు నాతమ్ముడేగా" అన్నాడట. తమ్ముడు సాగించే అన్ని అక్రమాలకూ అన్న రాజకీయ కవచం రక్షణ. పరస్పర సహకారంతో ఆస్తుల పెంపుదల, కిరాయి గూండాను పెట్టుకోవడం కన్నా తమ్ముడే అయితే వ్యవహారమంతా కుటుంబ పరిధిలోనే వుంటుందన్న ఆలోచనే అదీ.

సరళ చెప్పినవన్నీ విని, అరుణా వేణూ ఆలోచించిన తర్వాత, విడాకుల ఆలోచనని బలపర్చారు. సరళ తరపున ఆ కేసు తీసుకునేందుకు, గుంటూర్లో తమకు తెలిసిన లాయర్‌తో కూడా మాట్లాడారు. ఇంత అయిన తర్వాత సరళ దగ్గర్నుంచి మళ్లీఉత్తరం వచ్చింది. మోహనరావుకు, మళ్ళీ అధికారపక్షం నుంచి ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్ వచ్చిందట. ఈసారి గెలిస్తే అతను మంత్రి అయ్యే అవకాశం వుందట. భార్య, విడాకులు తీసుకుంటే, అతని రాజకీయ భవిష్యత్తు దెబ్బ తింటుందట. తన అత్తింటి, పుట్టింటి వారి నుంచే కాక, కూతురి అత్తింటివారి నుంచి కూడా సరళపై

ఇటువంటి వత్తిడి వస్తోందట. ముప్పాతిక జీవితం గడిచిపోయాక, విడాకులు తీసుకుని మాత్రం ఏం చెయ్యాలని తనకూ అనిపిస్తోందట. "ఇక అతన్తో కలసి వుండటం నావల్ల కాదు" అన్న సరళ ఇప్పుడు "విడాకులు తీసుకుని ఏం చెయ్యాలి?" అంటోంది. "నీ జీవితంతో సంబంధంలేని మనిషి రాజకీయ భవిష్యత్తు గురించి నువ్వెందుకాలోచించాలని" సరళకు ఉత్తరం రాశారు. తమ ఉత్తరానికి సరళ జవాబివ్వలేదు.

★ ★ ★

సరళ ఎన్నికల ప్రచారం సాగిస్తోంది. ఆడవాళ్ళకు బొట్టుపెట్టి, భర్తను గెలిపించమని దీనంగా, ఆత్మగౌరవ హీనంగా అడుక్కోవడం లేదామె, తన భర్తను ఓడించండనీ, అతనికంటే మంచివాడైన అభ్యర్థిని ఎన్నుకోండనీ కోరుతోంది. తన భర్తకు వ్యక్తిగత జీవితంలోనూ, సామాజిక జీవితంలోనూ నీతి లేదని వివరిస్తోంది. భార్యనే మనిషిగా చూడనివాడు "ప్రజల అభివృద్ధికి కృషి చేస్తాననడం పచ్చి అబద్ధం, మోసం" అని కుండ బద్దలు కొట్టినట్టు ప్రకటిస్తోంది. ఈ సరళ ముఖంలో ముసలి తనం ముంచుకొస్తున్న సూచనలే లేవు. ఆపాదమస్తకమూ ఒక కాంతి వలయంలాగా, ఆకారంలేని ఆశాభావంలాగా వుంది.

"వంట రెడీ...... " అంటూ వచ్చిన వేణు

"ఏంటి నిద్రబోయావా?" అనడిగాడు.

"ఏమో ....." అంది అరుణ. సరళను మళ్ళీ కళ్ళలోకి రప్పించుకోవాలనుకున్నట్టు కళ్ళు మూసుకుంది. సాధ్యం కాలేదు.

"ఇంకా నిద్రొస్తోందా? మళ్లీ జ్వరం వచ్చేట్టుందా?" అని కంగారుపడుతూ వేణు ధర్మామీటర్ కోసమేమో లేవబోయాడు. అరుణ చెయ్యి పట్టి ఆపింది.

"సరళ ఎన్నికల ప్రచారం చేస్తోంది....."

"సరే చదివాంగా పోనీ ఆ గొడవ......"

"చదివింది గాదు, చూసింది చెబుతున్నా విను........" అంటూ అరుణ తను ఇందాక చూసిన సరళను గురించి చెప్పింది. ఆమె అన్న మాటల్ని ఉత్సాహంగా, ఉద్రేకంగా కంపిస్తున్న శరీరంతో చెబుతోంది. అరుణ పరిస్థితి వేణుకు కొంచెం భయం కలిగిస్తోన్నా, ఆపకుండా తల మీద ప్రేమగా దువ్వుతూ విన్నాడు. అంతా విన్న తర్వాత, అరుణ

చూసిన సరళ స్వరూపాన్ని పోల్చుకున్నాడు. తన తలమీదున్న వేణు చేతిని అందుకుని, అరుణ అంది.

"సరళ అలా చెప్పడం చాలా బావుంది కదా!"

"అవును. చాలా బావుంది" అని ఒప్పుకుంటున్నట్టు అరుణ చేతిని మృదువుగా బిగించాడు.

"ఆడవాళ్ళు కేవలం 'భార్యలు'గా భర్తల నీడలుగా వుండడం చాలా బాగా లేదు కదా!"

దానికీ అవునన్నట్టు వేణు స్పర్శా సమాధానం. ఈ రెండో ప్రశ్న అడుగుతున్నప్పుడు అరుణ కంఠంలో కళ్ళలో వినిపించే కనిపించే బాధను సగం పంచుకుంటున్నట్టుండి పోయాడు.

*(1995 జనవరి 'ఆంధ్రజ్యోతి' ఆదివారం అనుబంధంలో ప్రచురితం)*

# -- కథ గురించి. . .

1994 చివర్న, రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచారం ఒక కొత్త పద్ధతిలో జరిగింది. అంతకు ముందు కూడా ఎన్నికల్లో నిలబడిన భర్తల తరుపున భార్యలు ప్రచారం చేయడం వుంది కానీ, అది ఇంత ఎక్కువగా, ఎబ్బెట్టుగా జరగలేదు. అభ్యర్థుల భార్యలు చుట్టూ మహిళా బృందాలను వెంటపెట్టుకుని, ఇంటింటికీ తిరిగి ఆడవాళ్ళకు బొట్టు పెట్టి తన భర్తను గెలిపించమని కోరారు. సెంటిమెంటల్ గా ఫీలయ్యేట్టు చేసి, ఆడవాళ్ళ ఓట్లను సంపాదించాలన్న ఎత్తుగడ ఇది. భార్యలను తమ తరుపున ప్రచారం చేయడానికి యీ విధంగా అనుమతించిన వాళ్లు, ఆ భార్యలు ఏ ఉద్యమానికో ప్రచారం చేస్తామంటే ఒప్పుకోరన్నది తెలిసిందే.

ఇంకోవైపున 'భార్యలెందుకు ప్రచారం చేస్తున్నట్టు?' అని ఆలోచిస్తే 'భార్యలు కనుక' అన్న తీర్మానానికి రావలసిందే. కాకపోతే, అధికారం అనేది ఇప్పుడు కుటుంబంలో అందరూ కలసి, అన్ని రకాలుగానూ పోరాడి సాధించుకోవలసిందిగానూ, సాధించుకో తగిందికానూ కనిపించడం కూడా ననుకోవాలి.

ఏమైనా, ఎన్నికల్లో తమ భర్తల తరుపున ప్రచారం చేసిన భార్యలందరూ (దాదాపుగా) తమభర్తలు అధికారంలో కొస్తే ప్రజాసేవచేస్తారన్న నమ్మకంతోనే ప్రచారం చెయ్యలేదని, కచ్చితంగా చెప్పవచ్చు. అదే యీ కథాంశం.